

8లో..

## ఇది ప్రజా విజయం

- ప్రధాని మోదీ పాలనకు బీహార్ ప్రజల పట్టం
- కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పారు..
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 352
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
నవంబర్ 14, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


వివరాలు2లో..





వరంగల్ వాయిస్ కథనానికి స్పందన

# గుంతల పూడ్చివేత




- ఇవేం రోడ్లు.. అంటూ ప్రత్యేక కథనం
- హనుమకొండ ట్రాఫిక్ పోలీసుల ఔదార్యం
- ఆర్ అండ్ బి సిబ్బందితో కలిసి బీటీ ఏర్పాటు
- కృతజ్ఞతలు తెలుపుతున్న జనం

నగరంలోని వరంగల్–హనుమకొండ–కాజీపేట ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు, ఆర్ అండ్ బి అధికారులు నడుం భిగించారు. 'ఇవేం రోడ్లు..?' పేరిట ఈ నెల 7న వరంగల్ వాయిస్ ఈవెనింగ్ డెయిలీలో ప్రచురితమైన కథనానికి ప్రజలనుంచి మంచి స్పందన లభించింది. ట్రై సిటీలో 500 పైనే గుంతలు.. ఆదమరిస్తే అటే అంటూ వాహనదారులు పడుతున్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు ప్రచురించడంతో అధికారుల్లో చలనం వచ్చింది. దీంతో హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం ములుగు రోడ్డు జంక్షన్ నుంచి వరంగల్ పోలీస్ కమీషరేట్ (సీపీఓ) జంక్షన్ వరకు ఉన్న గుంతల్లో డాంబర్ బీటీని వేసి చదును చేశారు. ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వారిని డైవర్ట్ చేస్తూ గుంతల్లో బీటీ నింపారు. దీంతో నగర ప్రజలు, వాహనదారులు అధికారులకు, వరంగల్ వాయిస్ కు కృతజ్ఞతలు తెలిపారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ







8లో..

# బాలలే దేశ భవిష్యత్

- వారి హక్కుల పరిరక్షణకు కృషి
- కలెక్టర్ స్నేహ శబరీష్
- కలెక్టరేట్ లో శాంతి కపోతం ఎగురవేత




# బాలలే దేశ భవిష్యత్

- వారి హక్కుల పరిరక్షణకు కృషి
- కలెక్టర్ స్నేహ శబరీష్
- కలెక్టరేట్ లో శాంతి కపోతం ఎగురవేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేటి బాలలే దేశ భవిష్యత్ అని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. 14 నవంబర్ బాలల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీస్, ఎఫ్ఎంఎంఎస్ఎస్ఎస్, డాన్ బాస్కో నవజీవన్ సమన్వయంతో కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ బాల్యం అందమైనదని ఆ అనుభూతిని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికిపై ఉందన్నారు. బాల్యం నుంచే సత్ప్రవర్తన, మానవతా విలువలు పెంపొందించి సన్మార్గంలో నడిపిస్తే బాలల దేశ భవిష్యత్ కు పునాది పడుతుందన్నారు. బాలల హక్కులకు భంగం కలుగకుండా, లింగ వివక్ష లేకుండా చూడాల్సిన అవసరం ప్రతి వ్యక్తిపై, కుటుంబం వ్యవస్థపై ఆధారపడి ఉందన్నారు. ఆ దిశగా కృషి చేస్తే నేటి బాలలను రేపటి ఆదర్శ సమాజ నిర్మాతలుగా మారుతారన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ హనుమకొండ ప్రాజెక్ట్ పరిధి అంగన్వాడీ ప్రీ స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాన్ని అలరించాయి. అనంతరం చిన్నారులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేవారు. శాంతి కపోతం, బెలూన్లు ఎగురవేశారు. జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి మాట్లాడుతూ 14 నవంబర్ నుంచి 20 వరకు వారాంతపు కార్యక్రమాలు, బాలల సంరక్షణ కేంద్ర బాల బాలికలకు చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వం, సింగింగ్, డాన్సింగ్ లాంటి పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## పేరెంట్స్, టీచర్స్ సమావేశం..

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెల నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కోరారు. శుక్రవారం హనుమకొండ జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం, పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో 386 మంది విద్యార్థులు చదువుతుండగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి తక్కువమంది హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారనేది తెలుసుకునేందుకు పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలోని ప్రీ ప్రైమరీ, ఒకటో తరగతులను కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఎంఈఓ నెహ్రూ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# అభ్యాస స్కూల్లో బాలల దినోత్సవం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరం శంభునిపేటలోనీ అభ్యాస స్కూల్ లో శుక్రవారం ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. భారత దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక గణేష్ నగర్ లోని అభ్యాస స్కూల్ లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పిల్లలు సమాజానికి పునాదులన్నారు. దేశ భవిష్యత్ అంతా చిన్నారులైన మీదే ఆధార పడి ఉందన్నారు. ప్రిన్సిపాల్ మండల శిరీష మాట్లాడుతూ చీకటి నుంచి వెలుగును ప్రసాదించే వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. చిన్నప్పటి నుంచే కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవోగా కరీం, డైరెక్టర్ గా సైఫ్, ప్రిన్సిపాల్ గా హిబహ్ ఇర, ఇంచార్జులుగా రిషిత, సహస్ర, సాయి, యశ్వంత్, పీఈటీలుగా యశ్వంత్, సమీర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేహమత్, ఇంచార్జి కోల రాము, రజిని, భారతి, ప్రియాంక, సుమయా పాల్గొన్నారు. యాంకర్స్ గా ఇబహ్ ఇరాన్, ఆదిత్రి, అక్షర వ్యవహరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అబ్బుర పరిచాయి.

# విద్యార్థులకు జీఆర్ కే ఫౌండేషన్ చేయూత



## □ పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు

**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** నగరంలోని 38 వ డివిజన్ ఖిలావరంగల్ లోని బాలికల ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఆరెల్లి బుచ్చయ్య ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు గంట రవికుమార్ స్థాపించిన జీఆర్ కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష ఫీజులను చెల్లించారు. పాఠశాల ప్రధానోపోధ్యాయులు కాట్రాజ్ వెంకటయ్య, కె.శైలంద్ర కుమార్ వారి ఉపాధ్యాయుల బృందం సమక్షంలో పరీక్ష ఫీజు మొత్తాని జీఆర్ కే ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఆర్ కే ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ ఎండి రఫీ, స్థానిక బీజేపీ సీనియర్ నాయకులు అంకాల జనార్ధన్, ఇనుముల అరుణ్, ఎల్లబోయిన చంద్రమోహన్, రేపల్లె స్వర్ణజ తదితరులు పాల్గొన్నారు.



# 16న సువర్ణలక్ష్మీ వ్రత మహాయాగం

## స్థల పరిశీలన చేసిన ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్

**వరంగల్ వాయిస్, దామెర :** ఈ నెల 16న దామెర మండలంలోని ఏకశిల పాఠశాలకు ఎదురుగా ఉన్న గ్రౌండ్ లో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న సువర్ణలక్ష్మీ దాంపత్య వ్రత మహాయాగ స్థలాన్ని శుక్రవారం ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పరిశీలించారు. మహా యాగా ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న నేపథ్యంలో వారి సంఖ్యకు అనుగుణంగా బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈస్ట్ జోన్ డీసీపీతోపాటు పరకాల ఏసీపీ సతీష్ బాబు, శాయంపేట సీఐ రంజిత్ రావు, దామెర ఎస్సై కొంక అశోక్ పాల్గొని స్థల పరిశీలన చేశారు.




# బాల్య వివాహాలు అరికట్టాలి

- మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి
- బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** బాల్య వావాహాల నిరోధక చట్టం–2006పై శుక్రవారం ఖిలా వరంగల్ మండలం కరీమాబాద్ శక్తి సదన్ హోమ్ లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి మాట్లాడుతూ బాల్య వివాహంతో జరిగే నష్టాలను వివరించారు. అదే విధంగా బాల్య వివాహాల నిరోధానికి చట్ట పరమైన చర్యలపై అవగాహన కల్పించారు. అదే విధంగా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ చంద్ర ఆర్య, సూపరింటెండెంట్ పి.పద్మ, అడ్మినిస్ట్రేటర్ జి.జయశ్రీ, కె.సుజాత, జి.శ్రీనివాస్, టి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

# 16 నుంచి మేడారం స్పెషల్ బస్సులు

- పల్లె వెలుగుకు రూ.130
- ఎక్స్ ప్రెస్ కు రూ.180
- ప్రకటించిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయ భాను

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. భక్తులందరూ సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకుని వారి మొక్కులను సమర్పించుకుంటారు. ఈ సంవత్సరం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 1 వరకు శ్రీ సమ్మక్క సారలమ్మ మేడారం జాతర జరుగుతున్న సందర్భంగా వరంగల్ రీజన్ భక్తుల సౌకర్యార్థం హనుమకొండ నుంచి మేడారంకు ప్రత్యేక బస్సులను 16 వ తేదీ ఆదివారం నుంచి నడపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ విజయ భాను తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి భక్తుల రద్దీకి అనుగుణంగా మేడారంకు బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. ఈ మేడారం ప్రత్యేక బస్సుల ఆపరేషన్ నిర్వహణకై హనుమకొండ బస్టాండ్ లో ఆర్టీసీ అధికారులు 24 గంటలు ప్రయాణికుల సేవల కొరకు అందుబాటులో ఉంటారన్నారు. అన్ని ఎక్స్ ప్రెస్, పల్లెవేలుగు బస్సులలో మహిళలకు, ఆడపిల్లలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందన్నారు. మేడారం జాతరకు వెళ్లు భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని సురక్షితంగా వారి మొక్కలను తీర్చుకోవాలని సూచించారు. మేడారం జాతరకు హనుమకొండ బస్టాండ్ నుంచి 6.10, 7, 8, 9, 12.10, 13, 13.40, 14.30, 20.20 బయలు దేరనున్నట్లు తెలిపారు. అదే విధంగా మేడారం నుంచి హనుమకొండకు బస్సులు 5.45, 9.45, 10.15, 11.15, 13.10, 16, 17, 17.30, 18 గంటలకు బయలు దేరుతాయని వెల్లడించారు. పల్లె వెలుగు బస్సు చార్జీలు పెద్దలకు రూ.130, పిల్లలకు రూ.80, ఎక్స్ ప్రెస్ బస్ చార్జీలు పెద్దలకు రూ.180, పిల్లలకు రూ.110 గా నిర్ణయించినట్లు విజయ భాను ప్రకటించారు.

# వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

◆ అభయ హాస్పిటల్ డాక్టర్ వైద్యం గౌతం
◆ ఉచిత డయాబెటిస్ క్యాంపు నిర్వహణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ మధుమేహ దినోత్సవం పురస్కరించుకుని, అభయ హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ 1000 పిల్లర్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అభయ హాస్పిటల్ లో ఉచిత డయాబెటిస్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 100 మందికి పైగా మధుమేహ స్క్రీనింగ్ టెస్ట్‌లు ఉచితంగా నిర్వహించారు. ఈ టెస్టుల విలువ ఒక్కొక్కరికి సుమారు రూ.2,500 ఉన్నప్పటికీ, ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా వాటిని ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా అభయ హాస్పిటల్ సీఈఓ, ఎండీ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ గౌతం వైద్యం మాట్లాడుతూ భారతదేశంలో మధుమేహం (షుగర్ వ్యాధి) వేగంగా ప్రబలుతోందని, దీనిపై సరైన అవగాహన లేకపోవడం, నివారణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ వ్యాధి ఎక్కువగా వ్యాప్తి



చెందుతోందని అన్నారు. మధుమేహం వల్ల కిడ్నీ, లివర్, గుండె వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీనిని అదుపులో ఉంచుకోవడానికి ఆహారపు అలవాట్లు, వ్యాయామం చాలా అవసరమని తెలిపారు. "ప్రతి ఒక్కరూ తమ షుగర్ లెవెల్స్ తరచూ చెక్ చేసుకుంటూ, డాక్టర్ సలహా మేరకు ఆహారపు అలవాట్లు సరిచేసుకోవాలి. ప్రతిరోజు ఒక గంట వ్యాయామం తప్పనిసరి చేసినట్లయితే, ఈ వ్యాధి వల్ల వచ్చే సమస్యలను మనం అధిగమించవచ్చు" అని డా.గౌతం వైద్యం సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నుంచి నరహరి సుధాకర్ రెడ్డి (ఫస్ట్ ఎఫ్ వీడీజీ), హరికిషన్ రెడ్డి (సెకండ్ వీడీజీ), చొప్పరి సోమయ్య (జడ్ సీ), రాజేందర్ (ఆర్ సీ), పాము శ్రీనివాస్ (డీసీ), అభయ హాస్పిటల్, 1000 పిల్లర్స్ క్లబ్ సెక్రటరీ వైద్యం రాజగోపాల్, జూలూరి చంద్రశేఖర్ (డీసీ) పాల్గొన్నారు. అలాగే, నాన్–లయన్స్ ప్రముఖులుగా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి–రవీందర్, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి, హనుమకొండ పద్మశాలి సంఘం అధ్యక్షులు బచ్చు ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో రైతు మృతి



**వరంగల్ వాయిస్, మల్హర్:** ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో అప్పాల ఐలయ్య(50) అనే రైతు మృతి చెందిన ఘటన మండలంలోని రుద్రారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఐలయ్య ఉదయం 6 గంటలకే తన పొలానికి నీళ్లు వేయడానికి వెళ్లి ట్రాన్స్ ఫార్మర్ వద్ద జంపర్ ఆన్ చేయడానికి ప్రయత్నించగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు హమాలి పని చేస్తూ, ఇటు వ్యవసాయం చేస్తాడని ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. కొయ్యూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ



**వరంగల్ వాయిస్, జనగామ:** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారంలయన్స్ క్లబ్ జనగామ మిలీనియం ఆధ్యర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ బండ భిక్షపతి అధ్యక్షతన జనగామ మండలం గానుగుపహాడ్ గ్రామంలోని స్కూల్లో పిల్లలకు 65 బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అలాగే మిలీనియం క్లబ్ పూర్వ అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ బాబు జన్మదిన దినం సందర్భంగా సంజీవిని హాస్పిటల్ లో 30 మందికి షుగర్ , బీపి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా క్లబ్ జోన్ చైర్మన్ లయన్ బైరు వెంకటేశ్వర్లు పాల్గొనగా, క్లబ్ కార్యదర్శి కాముని వరప్రసాద్, క్లబ్ కోశాదికారి దాసరి సుమన్, పీఆర్ సీ శ్రీరాం శ్రీనివాస్, యాట వెంకటేశ్వర్లు, భోగ కైలాసం, పూర్ణచందర్ పాల్గొన్నారు.

# ఆధునిక భారత దేశ సృష్టికర్త నెహ్రూ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** భారతదేశాన్ని సున్నా నుంచి శిఖరాగ్రానికి తీసుకెళ్లిన, ఆధునిక భారతదేశ సృష్టికర్త పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం నెహ్రూ జయంతి వేడుకలను శాయంపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం పంచవర్ష ప్రణాళికలను నెహ్రూ ప్రవేశపెట్టారని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించి, జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తుచేశారు. ఆయన ప్రగతిశీల ఆలోచనలతో ఎన్ని సవాళ్లు ఎదురైనా భారతదేశాన్ని సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధి వైపు నడిపించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శానం కుమారస్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు వరదరాజు, రాజేందర్, కట్టయ్య, గోపాల్ రెడ్డి, వీరన్న రంగారెడ్డి, కుమారస్వామి, బాసని శంకర్, ప్రకాష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని కాట్రపల్లి గ్రామంలోని సీఎస్ఐ బీజేఎం పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తుకు పునాదులని అన్నారు.

# బీఎస్సీ నర్సింగ్ సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు రెండో ఫేజ్ ఆప్షన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ, ఈరోజు ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంవైస్ ఛాన్సలర్ డా.నందకుమార్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా AISF జిల్లా అధ్యక్షుడు శరత్ మరియు కార్యదర్శి పార్థు మాట్లాడుతూ... బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు పేద, మధ్యతరగతి విద్యార్థులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే, సాంకేతిక కారణాల వల్ల లేదా సరైన సమాచారం లేకపోవడం వల్ల చాలా మంది విద్యార్థులు మొదటి దశ కౌన్సెలింగ్‌లో అవకాశం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. అందుకే, ఆ విద్యార్థులకు న్యాయం చేయడానికి, ఎక్కువ మందికి ప్రవేశ అవకాశం కల్పించడానికి తక్షణమే రెండో ఫేజ్ ఆప్షన్ కల్పించాల్సిన అవసరం ఉందని వారు వీసీని కోరారు. ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ విద్యార్థుల హక్కుల కోసం పోరాటం చేస్తుందని, ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు శ్రేయాస్, భరత్, ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో కాంగ్రెస్ సంబరాలు



**వరంగల్ వాయిస్, పరకాల:** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు, రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రజా పాలనకు నిదర్శనం అని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ విజయానంతరం, పట్టణంలోని బస్టాండ్ కూడలిలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ల నేతృత్వంలో జూబ్లీహిల్స్‌లో ఒక బీసీ బిడ్డను నిలబెట్టి గెలిపించడం జరిగిందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ కాంగ్రెస్ వైపే ఉన్నారని, ఇకనుండి ఏ ఎన్నిక వచ్చినా గెలుపు కాంగ్రెస్ పార్టీదే అని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, విజయం సాధించిన నవీన్ యాదవ్కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంబరాలలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బుజ్జన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మడికొండ శ్రీను, సమన్వయ కమిటీ సభ్యులు చిన్నాల గోనాథ్, ఈర్ల చిన్ని, పంచగిరి జయమ్మ, చందుపట్ల రాఘవరెడ్డి, దుబాసి వెంకటస్వామి, పసుల రమేష్, మర్క రఘుపతి గౌడ్, సదానందం గౌడ్, పోరాడ్ల సంతోష్, మడికొండ సంపత్ కుమార్, మంద నాగరాజు, రఘు నారాయణ, దార్నా వేణుగోపాల్, బొమ్మ కంటి చంద్రమౌళి, దుప్పటి సాంబశివుడు, బుచ్చు భాస్కర్, దావు పరమేశ్వర్, దుగ్గేల వినయ్, బాసాని సుమన్, సురేష్ బండారి కృష్ణ, మచ్చ సుమన్, నాగరాజు, సదన్నతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీల ధర్మ పోరాట దీక్ష

**వరంగల్ వాయిస్, పరకాల :** బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం పరకాల నియోజకవర్గ ఇంచార్జి ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలో బీసీ ధర్మ పోరాట దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 11 గంటలకు బస్టాండ్ వద్ద రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈ శిబిరం ప్రారంభమైంది. పద్మశాలి సంఘం నాయకులు పోరండ్ల సంతోష్ దీక్షకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆముదాలపెల్లి మల్లేశం గౌడ్, "బీసీల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే," అని గట్టిగా డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర నాయకులు సోదా రామకృష్ణ, మడికొండ శ్రీనులు దీక్షా శిబిరాన్ని ప్రారంభించి, బీసీ కుల సంఘం నాయకులకు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. బీజేపీ నేత డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ కూడా దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. సోదా రామకృష్ణ, కాళీ ప్రసాద్, మల్లేశం గౌడ్ మాట్లాడుతూ... బీసీల ఎదుగుదలకు కృషి చేస్తూ, 42 శాతం రిజర్వేషన్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పార్లమెంటులో ప్రత్యేక



బిల్లు పెట్టి కల్పించాలని ఉద్ఘాటించారు. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఈ దీక్షా శిబిరాన్ని, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస చారి సందర్శించారు. ఆయన బీసీ నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో మార్కా రఘుపతి గౌడ్, బండి సదానందం గౌడ్, బెజ్జంకి పూర్ణ చారి, కోడెల శ్రీనివాస్, బాలాజీ స్వామి, నల్లెల అనిల్, మొలుగూరి మురళి, రామ్మూర్తి, కోడెల సతీష్, మహేందర్, రాపర్తి కిరణ్, మడికొండ సంపత్ కుమార్, పాలకుర్తి శ్రీనివాస్, సయ్యద్ మక్సుద్, దండ్రే శంకర్, శనిగరపు రాజు, కర్రే రమేష్, విష్ణు తదితర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మత్తుకు బానిస కావొద్దు




**వరంగల్ వాయిస్, పరకాల :** విద్యార్థులు మత్తుకు బానిస కాకుండా చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చైతన్య సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకి ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్వీ కాలేజ్ చైర్మన్ శ్రీనివాస్ చారి, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాక, దేశంలోనూ విద్యార్థులు పెద్ద ఎత్తున మత్తుకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుకు దూరమై, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చకుండా తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, గురువులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. యూనివర్సిటీ అధ్యక్షులు చెన్నూరు సాయికుమార్, కార్యదర్శి బీరెడ్డి జస్వంత్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. చెడు మార్గాల్లో నడవకుండా, మద్యానికి బానిస కాకుండా, సోషల్ మీడియాకు పరిమితం కాకుండా మహనీయుల ఆలోచన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, ఆత్మకూరు మండల అధ్యక్షుడు బొజ్జ హేమంత్ తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ



**వరంగల్ వాయిస్, గణపురం :** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ సాధించిన అఖండ విజయాన్ని పురస్కరించుకుని, శుక్రవారం మధ్యాహ్నం గణపురంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రేపాక రాజేందర్ నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ర్యాలీగా వచ్చి పెద్ద ఎత్తున టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ గెలుపుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పకడ్బందీ వ్యూహాలే ప్రధాన కారణమని కొనియాడారు. రేవంత్ రెడ్డికి జేజేలు పలుకుతూ, గెలుపొందిన నవీన్ యాదవ్కు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అభ్యర్థి విజయానికి దోహదపడ్డాయని వారు పేర్కొన్నారు. అదే సమయంలో, కేటీఆర్ అహంకారపూరిత ప్రసంగాలు, ఫేక్ ప్రచారం, బీఆర్ఎస్ పై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత ఆ పార్టీ అభ్యర్థి ఓటమికి కారణమయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ విజయోత్సవ ర్యాలీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణ, దుర్గయ్య, మహేష్, శంకర్ గౌడ్, డి.శంకర్, మల్లికార్జున స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పద్మశాలీల కార్తీక వనభోజనోత్సవానికి సన్నాహాలు

### 16న ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో వేడుక



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న కార్తీక మాస వనభోజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు బేతి అశోక్ బాబు తెలిపారు. గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా చింతల్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని కిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్ లో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నారు. పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు బేతి అశోక్ బాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. వనభోజనోత్సవంలో భాగంగా మొదటగా గణపతి పూజ, శివ పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం పద్మశాలీల ఆరాధ్య దైవం మార్కండేయ మహర్షి పఠనం, ఉసిరి చెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహించి, పండుగను ప్రారంభిస్తారు. దీని తర్వాత పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ముఖ్య అతిథుల ప్రసంగాలు, అతిథుల సన్మాన కార్యక్రమాలు ఉంటాయి. అశోక్ బాబు మాట్లాడుతూ పద్మశాలీ కుల బాంధవులందరూ, డాక్టర్లు, ప్రొఫెసర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, వ్యాపారస్తులు, చేనేత కార్మికులు, చేనేత సంఘాల నాయకులు, కుల పెద్దలు సకుటుంబ సమేతంగా జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చి, పద్మశాలీల ఐక్యతను చాటాలని కోరారు. సామూహికంగా పూజా కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## మిరపలో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పసరుగొండ గ్రామంలో శుక్రవారం వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ఆధ్వర్యంలో మిర్చి తోటలను సందర్శించి, రసం పీల్చే పురుగుల నివారణపై రైతులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు మేడిపల్లి కుమారస్వామి, మేడిపల్లి నాగరాజు, రాజయ్య, ఏఈఓ రామకృష్ణ పాల్గొన్నారు. ప్రస్తుతం మిరప తోటల్లో తామర పురుగుల బెడద, పై ముడత, కింది ముడత మరియు నల్లి బెడద గమనించడం జరిగింది. వీటి నివారణలో భాగంగా ముందు జాగ్రత్తగా రైతులు ప్రతి ఎకరానికి 15 నుండి 20 జిగురు అట్టలను వాడాలని ఏఈఓ రామకృష్ణ సూచించారు.

## "శత రుద్రాభిషేక సహిత శత చండీయాగ మహోత్సవం"



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజులపాటు హనుమకొండ రాంనగర్‌లోని భువనేశ్వరి మాత దేవాలయంలో వైభవోపేతంగా "శత రుద్రాభిషేక సహిత శత చండీయాగ మహోత్సవం" నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోతుకూరి రామేశ్వరరావు తెలిపారు. ఈ మహోత్సవంలో భాగంగా నవంబర్ 17న, శ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహాసంస్థాన పీఠాధీశ్వరులు పరమహంస పరివ్రాజకులు జగద్గురు శ్రీశ్రీశ్రీ మదభినవోదండ విద్యాశంకర భారతి స్వామి వారు విచ్చేసి భక్తులకు ఆశీస్సులు అందజేయనున్నారని ఆయన పేర్కొన్నారు. ఉత్సవాలు నిర్వహిస్తున్న మూడు రోజులు కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద పండితులు, యాగ్నికులు, ఆధ్యాత్మిక రంగంలో ప్రతిభ కలిగిన ప్రముఖులచే హోమాలు, పూజలు, వైదిక కార్యక్రమాలు, నామ సంకీర్తన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నవంబర్ 16న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీమతి కొండూరి పద్మావతి గారిచే సౌందర్య లహరి పారాయణం. సాయంత్రం శృంగేరి సంస్థానం భారతీ తీర్థ పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ.పా శర్లపూడి శ్రీనివాస బంగారయ్య శర్మచే ప్రవచనం, బ్రహ్మశ్రీ.కొడకండ్ల రాధాకృష్ణ శర్మచే నామ సంకీర్తన ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త, డీపీఆర్ఓ కార్యాలయం విశ్రాంత ఉద్యోగి గుండవరం విధుమౌళి మాట్లాడుతూ ఆలయ ధర్మకర్తలు, వరసిద్ధి వినాయక కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు, భక్తులు, మహిళలు ఈ శత చండీ యాగ మహోత్సవంలో పాల్గొని ఆధ్యాత్మికంగా చైతన్యం పొందాలని కోరారు. సనాతన ధర్మమే ధ్యేయంగా ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు.

## సబ్ సెంటర్ తలుపు ఊడిపడి పేషెంట్‌కు గాయాలు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని పాత పంచాయతీ భవనంలో నడుస్తున్న సబ్ సెంటర్‌లో శుక్రవారం నాడు పెను ప్రమాదం జరిగింది. సబ్ సెంటర్ గదికి ఉన్న తలుపు (దర్వాజా) ఊడిపడి, చికిత్స కోసం వచ్చిన తాళ్లపల్లి అయిలమ్మ అనే పేషెంట్‌కు ఎడమ భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలికి వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే తీయించి చికిత్స అందించారు. చాలా కాలంగా గ్రామ పంచాయతీ పాత భవనంలోని ఒక పోర్షన్‌లో సబ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. అయితే, ఆ భవనంలోని తలుపులు తరచూ ఊడి పడుతూ ఉండడంతో, సిబ్బందితో పాటు రోగులకు గాయాలవుతున్నాయని సబ్ సెంటర్ ఏఎన్ఎం, ఆశ వర్కర్లు చెబుతున్నారు. సబ్ సెంటర్ సిబ్బంది ఈ ప్రమాదకర పరిస్థితిని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. తలుపులు ఊడిపోతున్న పోర్షన్ కాకుండా, ఆ భవనంలోని పక్క పోర్షన్‌కు సబ్ సెంటర్‌ను మార్చాలని వారు కార్యదర్శిని కోరారు. అయితే, పంచాయతీ కార్యదర్శి "రేపిస్తాను, మాపిస్తాను" అంటూ జాప్యం చేస్తుండడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జర్నలిస్టులు సైతం ఈ విషయంపై గురువారం పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఆయన పక్క పోర్షన్‌కు మార్పించడంలో నిర్లక్ష్యం వహించినట్లు తెలుస్తోంది. ఈ నిర్లక్ష్యం కారణంగానే శుక్రవారం అయిలమ్మ తీవ్ర గాయాల పాలైంది. ఇంకా ఎంతమంది రోగులు ప్రమాదంలో పడాలని గ్రామస్తులు ప్రశ్నించడంతో పాటు అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు.

# తూర్పులో కాంగ్రెస్ సంబరాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా, కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. వరంగల్ చౌరస్తాలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాల నవీన్ రాజ్ మాట్లాడుతూ కొండా దంపతులు ఆదేశాల మేరకు వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి సుమారు వంద మంది ముఖ్య నాయకులు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి వెళ్లి ప్రచారం నిర్వహించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ల నాయకత్వంలోనే కాంగ్రెస్ అభ్యర్థి అఖండ మెజార్టీ సాధించారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కొండా దంపతుల అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో మరియు గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్లు జారతి రమేష్, కత్తెర శాల వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు మబ్బు ప్రవీణ్, కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బాసాని శ్రీనివాస్, ఆకుతోట శిరీష్, భోగి సురేష్, పుష్కమల సుధాకర్, జారతి వెంకటేశ్వర్లు, నాగపూరి సంజయ్, బెడుద వీరన్న, తొగర్ క్రాంతి, బత్తిని అఖిల్, రాందేవ్, గడ్డమీది రాజేష్, పప్పు వేణు, అప్ప రవి, చందర్, మహిళా నాయకురాలు రాజమణి తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కొండా దంపతుల అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

**● ములుగు కలెక్టర్ దివాకర టీఎస్**



**వరంగల్ వాయిస్, ములుగు :** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. అభివృద్ధి విషయంలో అన్ని శాఖలతో పాటు పోలీసుల సహకారం అందడం గొప్ప విషయమని ఆయన కొనియాడారు. శుక్రవారం గోవిందరావుపేట మండలం చల్వాయిలోని తెలంగాణ స్పెషల్ పోలీస్ ఐదవ బెటాలియన్‌లో నూతన జిమ్, ఓపెన్ ఏరియా జిమ్‌ను జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ ములుగు జిల్లా లాంటి ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులు పని చేయడం సాహసం చేయడం లాంటిదేనని అన్నారు. ఏ పని చేసినా ప్రజల మన్ననలు పొందడానికి కృషి చేయాలని సూచించారు. విపత్కర పరిస్థితులలో ఎస్డీఆర్ఎఫ్ ) చేసిన సేవలు ప్రశంసనీయమని, ములుగు జిల్లాలోనే కాకుండా వరంగల్ జిల్లాలో సైతం వారి సేవలను అందించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని కాపాడే విషయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సాహసం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. కష్టంతోనే ఫలితం దక్కుతుందని, ప్రతి ఒక్కరూ తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. బెటాలియన్‌కు కావలసిన సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇస్తూ, నూతన రోడ్డు ఏర్పాటు కోసం అంచనాలు తయారు చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లాలో పోలీస్ శాఖ చేస్తున్న సేవలు గొప్పవని, రానున్న రోజుల్లో వారి సేవలు ఇలాగే కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ బెటాలియన్‌లో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి.సీతారాం, అసిస్టెంట్ కమాండెంట్లు – అనిల్ కుమార్, వరను గోపాల్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకై పార్టీలకతీతంగా ఏకం కావాలి



**వరంగల్ వాయిస్, కేయూ :** బీసీ రిజర్వేషన్ల సాధనకై రాజకీయ నాయకులందరూ పార్టీలకతీతంగా ఏకం కావాలని కేయూ పాలకమండలి సభ్యులు, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు గౌడ్, ఆచార్య ఐలయ్య పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ (కేయూ) మహాత్మ జ్యోతిరావు పూలే ప్రాంగణంలో బీసీ విద్యార్థి జేఏసీ ఆరుగంటి నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీల ధర్మ పోరాట దీక్ష శుక్రవారం నాటికి ఐదవ రోజుకు చేరుకుంది. కేయూ పాలకమండలి సభ్యులు, డాక్టర్ చిర్ర రాజు గౌడ్, ఆచార్య ఐలయ్య దీక్షను ప్రారంభించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అగ్రవర్ణాలకు, బీసీలకు జరిగినటువంటి పోరాటంలో బీసీ బిడ్డ నవీన్ యాదవ్ 25 వేల భారీ మెజార్టీతో గెలవడం బీసీల గెలుపుగా భావిస్తున్నామన్నారు. ప్రజలు ధర్మం పైన నిలబడ్డారని, ఈ ఎన్నిక బీసీల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. "ఇకపైన ఏ ఎన్నికలు జరిగినా తెలంగాణ రాష్ట్రంలో బీసీలే గెలుస్తారు. తెలంగాణ రాజకీయ పార్టీలకు బీసీలే దిక్కు. బీసీల ఓట్లు లేకపోతే అగ్రవర్ణ నాయకులకు కుర్చీలు లేవు, అధికారం లేదు" అని మండిపడ్డారు. ఇదేవిధంగా బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయి, బీసీలంతా ఐక్యమత్యంగా ఉండి, రాజకీయాలకు అతీతంగా పోరాటం చేసి బీసీ రిజర్వేషన్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల సాధనకై జరుగుతున్న ఈ పోరాటానికి సంఘీభావంగా బార్ అసోసియేషన్ చైర్మన్ పులి సత్యం, ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయి నీ నరేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరస్వామి, వీకేఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీనివాస్, కేయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బూర నవీన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ యూనస్, తాటి దామోదర్, సతీష్ బాబు పాల్గొన్నారు. దీక్ష విరమణ సమయంలో బీసీ ఇంటర్నేషనల్ ఫోరం మిత్రులు జాయింట్ ప్రొఫెసర్ కూరపాటి రమేష్, చందా మల్లయ్య సంఘీభావం తెలిపి, బీసీ విద్యార్థి జేఏసీ నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు పటేల్, కళ్లేపల్లి ప్రశాంత్, సాయి, కాగితపు నాగరాజు, అజయ్, అన్వేష్, రాజశేఖర్, రాజేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# గోపా కార్తీక వనభోజనాలకు గౌడ కులస్తులు తరలిరావాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 16 ఆదివారం ఖిలా వరంగల్ మధ్యకోట చిల్డ్రన్ పార్క్‌లో నిర్వహించనున్న 23వ గోపా కార్తీక వనభోజన కార్యక్రమానికి గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని గోపా హన్మకొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు డా.చిర్ర రాజు గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నయీమ్ నగర్ బీసీ కార్యాలయంలో డా.చిర్ర రాజు గౌడ్ అధ్యక్షతన గోపా జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో గోపా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనభోజనాలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి వరంగల్ ఉమ్మడి జిల్లాలోని గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, గోపా రాష్ట్ర అధ్యక్షులు బండి సాయన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. గోపా జిల్లా నాయకులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, బోనగాని యాదగిరి గౌడ్, గునిగంటి రమేష్, నాల్లమ్ ఆనంద్ గౌడ్, పెరుమాండ్ల అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

# వంద శాతం గ్రౌండింగ్ కావాలి

**◆ మంజూరైన ప్రతీ ఇల్లు నిర్మాణం కావాలి**

**◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**వరంగల్ వాయిస్, జనగామ :** నిరుపేదలకు కనీస నివాస గృహం ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను జిల్లాలో వంద శాతం త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ అంశంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఆర్డీఓలు, హౌసింగ్ పీడీ, ఎంపీడీఓలు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ శుక్రవారం గూగుల్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముందుగా అన్ని మండలాల వారీగా ఇంకా నిర్మాణాలు ప్రారంభించకుండా ఉన్న ఇళ్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంజూరైన ప్రతి ఇళ్ల నిర్మాణం ప్రారంభం కావాల్సిందేనని స్పష్టం చేశారు. నిర్మాణాలు ఎందుకు చేపట్టలేదో అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి, వారి సమస్యలు ఏమైనా ఉంటే తెలుసుకోవాలన్నారు. ఎస్ హెచ్‌జీ గ్రూపుల ద్వారా లబ్ధిదారులకు రుణాలు ఇప్పించి, నిర్మాణాలను ప్రారంభించే విధంగా పేదలకు సహకరించాలని ఆదేశించారు. మార్కింగ్ చేసినప్పటికీ ఇంకా బేస్‌మెంట్ నిర్మాణం చేయని లబ్ధిదారులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొని ఆ నిర్మాణాలను త్వరగా పూర్తి అయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. సూర్యాపేట నుంచి వస్తున్న ఇసుకను త్వరగా సరఫరా చేసి లబ్ధిదారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మైన్స్ ఏడీని కలెక్టర్ ఆదేశించారు. రోజుకు కనీసం 50 ట్రిప్పుల ఇసుక రవాణా అయ్యేలా చూడాలన్నారు. అదే విధంగా, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకానికి సంబంధించిన లబ్ధిదారుల వెరిఫికేషన్‌ను రేపటిలోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు.

# రామప్పను సందర్శించిన నెదర్లాండ్ దేశస్తులు



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్:** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని ప్రపంచ వారసత్వ సంపద రామప్ప దేవాలయాన్ని శుక్రవారం నాడు నెదర్లాండ్స్ దేశానికి చెందిన జోహన్–హాలేన్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, అర్చకులు హరీష్ శర్మ, ఉమా శంకర్ వారికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం, టూరిజం గైడ్ విజయ్ కుమార్ వారికి ఆలయ చరిత్ర, శిల్పకళా ప్రాముఖ్యతను గురించి వివరంగా వివరించారు. రామప్ప శిల్పకళను తిలకించిన జోహన్–హాలేన్ దంపతులు మాట్లాడుతూ రామప్ప ఆలయం ఒక "గ్రేట్ ఆర్కిటెక్చర్, బ్యూటిఫుల్ టెంపుల్" అని కొనియాడారు. అనంతరం వారు రామప్ప చెరువును కూడా సందర్శించి, అక్కడ బోటింగ్ చేశారు. వారి వెంట దేవాదాయ, టూరిజం, పురావస్తు శాఖల సిబ్బంది, అలాగే టూరిస్ట్ పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్, దశరథ్, బద్రు ఉన్నారు.

# ఉపాధి హామీ కింద పశువుల షెడ్ల నిర్మాణం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులు, పశుపోషకులు, గొర్ల పెంపకందారులకు అండగా నిలిచేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణాలను మండలంలో ప్రారంభించారు. మల్హర్ మండలంలోని కొండంపేట, ఇప్పలపల్లి గ్రామాలలో శుక్రవారం నాడు ఎంపీడీవో క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ముగ్గు వేసి షెడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో క్రాంతి కుమార్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కిందనే ఈ పశువుల షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, జాబ్ కార్డు కలిగిన పాడి రైతులు, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవలే మల్హర్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన క్రాంతి కుమార్ తొలిసారిగా కొండంపేట గ్రామానికి విచ్చేయడంతో కార్యదర్శి రజిత, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్ ఆయనను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ మంగీ లాల్, టీఏ శైలజ తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్‌ఎం ఉద్యోగుల మహా ధర్నా




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఆల్ కేడర్ ఉద్యోగులు శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి మహా ధర్నా నిర్వహించారు. పని ఎక్కువ, జీతాలు తక్కువ అన్న నినాదంతో రోడ్డెక్కిన ఎన్ హెచ్‌ఎం ఉద్యోగులు, తమ కుటుంబాలు రోడ్లపాలవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎన్ హెచ్‌ఎం ఉద్యోగులు తమ ప్రధాన డిమాండ్లను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్హెచ్‌ఎం ఉద్యోగుల జిల్లా నాయకులు ఎండీ.రుక్మిద్దిన్, డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ మహేందర్, డాక్టర్ సురేష్, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ వినోద్ కుమార్, నాయకులు రాజేంద్ర ప్రసాద్, అనిత, విజేత, సుష్మ, అనూష, కనిష్క, ప్రవీణ్, సుదర్శన్, వినోద్, నరేష్, రాకేష్, రహమాన్, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, డీపీఎంయూ, పీడీఎంఓలు, డీటీసీఓ, జీఎంహెచ్, మిడ్ వైఫారీస్, ఎస్ఎన్‌సీయూ, సీఎల్ఎంసీ, టి–హబ్, ఏఎన్ఎంలు, నర్సింగ్ ఆఫీసర్స్, ఫార్మసీ ఆఫీసర్స్, ఎల్‌టి, అకౌంటెంట్స్, అటెండర్స్ సహా అన్ని కేడర్ల సిబ్బంది పాల్గొన్నారు.

## గోల్డెన్ ఓక్ స్కూల్‌లో బాలల దినోత్సవం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ శివనగర్‌లోని గోల్డెన్ ఓక్ స్కూల్‌లో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బాలల దినోత్సవాన్ని స్కూల్ చైర్మన్ గంట రవి కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా, ఉత్సాహంగా నిర్వహించారు. భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని, ఆయన పిల్లలపై చూపిన ప్రేమకు గుర్తుగా నవంబర్ 14న ఈ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిల్లల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దల బాధ్యతను గుర్తు చేస్తూ, వారి కలలకు మద్దతునిచ్చేందుకు పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు తమ అభిమాన పాత్రల వలె, చారిత్రక వ్యక్తుల వలె దుస్తులు ధరించి కనువిందు చేశారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రదర్శనలు, ప్రసంగాలు, ఆటలు, క్రీడలు, స్కిట్లు, నృత్యాలు, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ జి.మనోహర్ రావు మాట్లాడుతూ... భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పిల్లలను దేశ భవిష్యత్తుకు పునాదిగా భావించేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అరవింద పబ్లిక్ స్కూల్‌లో..



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** జాతీయ బాలల దినోత్సవం (పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి) సందర్భంగా, నగరంలోని 42వ డివిజన్, రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థిని ఆయేషా బేగం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించగా, మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా అనుభూతిని పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య, ఉపాధ్యాయులుగా చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులందరికీ మిఠాయిలను పంపిణీ చేశారు. కరస్పాండెంట్ పంచకం నర్సయ్య, కె.అద్వైత కేతన, మునిబా, రిజ్వాన, ఎన్.విజయలక్ష్మి, ఏ.మన్విత, ఎం.రీతిక, ఆర్.భవిత శ్రీ, ఆర్.సహస్ర, ఎన్.స్నికిత శ్రీ, డి.అక్షిత్, ఏ.శివానంద్, కె.సుశాంత్ లు వ్యవహరించగా, ఎండీ.ఆయాన్ పీఈటీగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ములుగు మండలం దేవగిరిపట్నంలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవంతో పాటు బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వయం పరిపాలన దినోత్సవంలో పాఠశాల విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తమ బోధనతో తోటి విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆకట్టుకున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా భారతదేశ మొట్టమొదటి ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ స్వయం పరిపాలన దినోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణకు కృషి

◆ అదనపు డీసీపీ (సీఏఆర్) శ్రీనివాస్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని, జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ కోసం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేస్తున్నాయని అదనపు డీసీపీ (సీఏఆర్) శ్రీనివాస్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీస్, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్, డాన్ బాస్కో నవజీవన్ స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో శుక్రవారం వాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వాకథాన్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా అదనపు డీసీపీ (సీఏఆర్) శ్రీనివాస్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ కోసం జిల్లాలో వివిధ మాధ్యమాల ద్వారా బాల్య వివాహాల నివారణ, బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా, ఆన్‌లైన్ లైంగిక వేధింపులకు గురికాకుండా బాలలను అప్రమత్తం చేసే చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. సైబర్ క్రైమ్ ఏసీపీ గిరికుమార్ మాట్లాడుతూ బాలల సంరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా కృషి చేయాలని, ముఖ్యంగా కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బాలల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, సందసాని రాజేంద్ర ప్రసాద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ అనితా రెడ్డి, సీడీపీఓ విశ్వజ, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సీహెచ్ అవంతి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ జె.శ్యామ్ సుందర్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్‌ఛార్జి అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, డెమో అశోక్ రెడ్డి, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ బత్తుల కరుణ, డాన్ బాస్కో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పి.సంతోష్, ఎన్సీఎల్‌పీ డైరెక్టర్ బుర్ర అశోక్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ ఎస్.భాస్కర్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.మౌనిక, శ్రీనివాసులు, సునీత, చైతన్య, సుజాత, విజయ్, రజిత, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ట్రైనీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'స్వయం పరిపాలన దినోత్సవం'




**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులచే స్వయం పరిపాలన దినోత్సవం ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులు పాఠశాలలోని కీలక బాధ్యతలను స్వీకరించి, తమ ప్రతిభను కనబరిచారు. నాగ చైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా, వి.సురేష్ మండల విద్యాశాఖ అధికారిగా, ఈ.హర్ష వర్ధన్ జిల్లా విద్యాశాఖ అధికారిగా, బి.అలేఖ్య జిల్లా కలెక్టర్‌గా వ్యవహరించారు. అలాగే, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సైన్స్, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన తరగతులను కూడా విద్యార్థులే ఉపాధ్యాయులుగా బోధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెమొంటోలతో మరియు శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి లాకావత్ రాజేష్ కుమార్ గారితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు శ్రీలత, రుక్మిణి, రమేష్ రెడ్డి, సుదక్షిణ, సుజన, మాధవి, రేణుక, ఉమామహేశ్వర్, దేవేందర్, వెంకట్ రెడ్డి, నజీర్ పాల్గొన్నారు.

## విద్యార్థులే దేశానికి వెన్నెముక



**వరంగల్ వాయిస్, దామెర :** బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని, దామెరలోని డిస్నీ ల్యాండ్ పాఠశాలలో శుక్రవారం నాడు సుమారు 850 మంది విద్యార్థులతో 'స్వయం పరిపాలన దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించారు.


ఈ ప్రత్యేక కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థినులు ఉపాధ్యాయినిలుగా మరియు 80 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల యాజమాన్యం సభ్యులు దయ్యాల మల్లయ్య, సదయ్య, బాలుగు లక్ష్మినివాసం, బాలుగు శోభారాణి, డి. రాకేష్ భాను, డి. దినేష్ చందర్ లు మాట్లాడుతూ విద్యార్థులే దేశానికి వెన్నెముక లాంటి వారని, రేపటి భావి భారత పౌరులు వారేనని అన్నారు. విద్యార్థులందరూ సన్మార్గంలో నడిచి దేశ భవిష్యత్తుకు తోడ్పడాలని సూచించారు. అలాగే, విద్యార్థులను చక్కగా గైడ్ చేసిన ఉపాధ్యాయులను, ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు.

# నెహ్రూ పంచవర్ష ప్రణాళికలతో దేశాభివృద్ధి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. హనుమకొండ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వీ.శ్రీనివాస్ రావు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈ.వీ.శ్రీనివాస్ రావు మాట్లాడుతూ భారతదేశంలో నవ భారతానికి పునాదులు వేసి, ఈనాడు ప్రపంచ దేశాల్లో గొప్ప ప్రజాస్వామిక దేశంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలబడిందంటే అది నెహ్రూ వల్లే సాధ్యమైందని అన్నారు. ముందు చూపుతో ప్రజలందరికీ వైజ్ఞానిక దృక్పథాన్ని ఏర్పాటు చేయడం వల్లే భారతదేశం ఈ స్థాయికి వచ్చిందని తెలిపారు. పంచవర్ష ప్రణాళికలను రూపొందించి పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను నెహ్రూ పటిష్ఠం చేశారని కొనియాడారు. భూ పంపిణీ విధానాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. దేశంలో సాగునీటి ప్రాజెక్టులు, నీటి పారుదల కాలువలు త్రవ్వించడం, ఆనకట్టలు కట్టించిన నెహ్రూ చేసిన కృషిని ఎన్నటికీ మరువలేమని ఉద్ఘాటించారు. నెహ్రూ ప్రధాని అయ్యాకనే భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా నిలబడిందని తెలిపారు. నెహ్రూ కుటుంబం తమ జీవితాలను దేశ ప్రజలకు అంకితమిచ్చిందని, ఆయన ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వేంకటేశ్వర్లు, హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు బంక సరళ, ఎస్.సి డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, మార్క విజయ్ కుమార్ గౌడ్, బంక సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సంక్రాంతి రిలీజ్ కోటాలో అఖండ`2 ?




టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్‌లలో 'అఖండ 2' ఒకటి. నందమూరి బాలకృష్ణ ` బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. 'అఖండ' బ్లాక్‌బస్టర్ విజయానంతరం వస్తున్న సీక్వెల్ కావడంతో అభిమానుల్లో ఉత్కంఠ పీక్స్‌కి చేరింది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త మీనన్, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన అఖండ 2 ఫస్ట్ గ్లిమ్స్ సోషల్ మీడియాలో దుమ్మురేపింది. బాలయ్య పవర్‌ఫుల్ లుక్, బోయపాటి స్టైల్ మాస్ ఎలివేషన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. సినిమా షూటింగ్, డబ్బింగ్ పూర్తయ్యాయి. అయితే, విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఇంకా వేగంగా సాగుతున్నాయి. మేకర్స్ ముందుగా ప్రకటించిన డిసెంబర్ 5 రిలీజ్ ఇప్పటికి అనుమానాస్పదంగా మారింది. రిలీజ్‌కి ఇంకా 20 రోజులు మాత్రమే ఉన్నప్పటికీ, ప్రమోషన్స్‌లో అంత వేగం కనిపించక పోవడంతో మూవీ విడుదలపై అనుమానాలు మొదలయ్యాయి. అంతేకాక ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, మేకర్స్ ఇప్పుడు సంక్రాంతి రిలీజ్ పై దృష్టి పెట్టారని వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరి 9న విడుదల కావాల్సిన రాజాసాబ్ సినిమా పనులు పూర్తి కావడం లేదని , దీంతో ఆ స్లాట్ ఖాళీ కావచ్చని టాక్ వినిపిస్తున్న నేపథ్యంలో ఆ తేదీకి అఖండ 2ను రిలీజ్ చేసేందుకు టీమ్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇదే నిజమైతే, ఈసారి సంక్రాంతికి బాలయ్య ,చిరంజీవి బాక్సాఫీస్ క్లాష్ జరిగే అవకాశం ఉంది. చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు చిత్రం'తో రానుండగా, బాలయ్య 'అఖండ 2'తో దుమ్మురేపేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే అభిమానులు సోషల్ మీడియాలో 'అఖండ 2 ఎప్పుడు రిలీజవుతుంది?', 'సంక్రాంతికేనా?' అని ప్రశ్నలు కురిపిస్తున్నారు.

## రివాల్వర్ రీటాగా వస్తోన్న కీర్తి సురేశ్




విభిన్న పాత్రలతో దూసుకుపోతున్న అగ్ర కథానాయిక కీర్తి సురేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. ఈ సినిమాకు కె. చంద్రు దర్శకత్వం వహిస్తుండగా.. సీనియర్ నటి రాధికా శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. కీర్తి సురేశ్ ఈ సినిమాలో 'రీటా' అనే సామాన్య మధ్యతరగతి యువతి పాత్రలో కనిపించనుంది. అనూహ్య పరిస్థితుల కారణంగా ఆమె తుపాకీ (రివాల్వర్) పట్టుకోవాల్సి వస్తుంది. ఆ తర్వాత ఆమె ఎలాంటి సాహసాలు, సవాళ్లు ఎదుర్కొంది అనేది ప్రధాన కథాంశం. ఇది కామెడీ అంశాలతో కూడిన పక్కా యాక్షన్ థ్రిల్లర్ చిత్రంగా రాబోతుంది.






## రామోజీలో ఎస్ఎస్ఎంబీ29' మూవీ ఈవెంట్

పాస్ ఉంటేనే రావాలన్న దర్శకుడు రాజమౌళి మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో భారీ యాక్షన్ అడ్వెంచర్ తెరకెక్కుతున్న 'ఎస్ఎస్ఎంబీ29' మూవీకి సంబంధించి శనివారం రామోజీ ఫల్మ్ సిటీలో భారీ ఈవెంట్ ప్లాన్ చేశారు. దీనికి ప్రత్యేకంగా పాస్‌లు కూడా విడుదల చేశారు. ఈ చిత్రాన్ని శ్రీదుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్ నారాయణ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం అభిమానులు, ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. దర్శకుడు రాజమౌళి ఈ చిత్రానికి సంబంధించి ఏ సమాచారం లేకుండా పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా లుక్‌లతోపాటు సంచారి పాటను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తి రేకెత్తిస్తున్నారు. ఈ నెల 15న రామోజీ ఫిల్మ్ సిటీ ఈ చిత్రానికి సంబంధించి ఓ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జియో హాట్‌స్టార్‌లో ఈ వేడుక స్ట్రీమింగ్ కానుంది. దీనికి సంబంధించిన కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈవెంట్‌ను వీక్షించడానికి వచ్చే అభిమానులు, ప్రేక్షకుల కోసం చిత్ర బృందం ప్రత్యేకంగా పాస్‌లు సిద్ధం చేసింది. పాస్‌పోర్ట్ తరహాలో తీర్చిదిద్దిన ఈ పాస్‌లకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్‌కు సంబంధించి ఆయన పుట్టినరోజులు విడుదల చేసిన ప్రీలుక్‌లో ధరించిన త్రిశూలం బొమ్మతో ప్రింట్ చేసిన పాస్‌లో లోపల పేజీలో మహేశ్, ప్రియాంక, పృథ్వీరాజ్, రాజమౌళి ఫొటోలను, ఈవెంట్‌కు వచ్చేవారు పాటించాల్సిన సలహా, సూచనలు, రూట్ మ్యాప్ అందులో ఉంచారు. ప్రస్తుతం ఈ ఇన్విటేషన్ ప్రేక్షకుల్ని ఆకర్షిస్తోంది. అంతే కాదు ఈ కార్యక్రమానికి వచ్చే ప్రేక్షకులకు జాగ్రత్తలు చెబుతూ రాజమౌళి ఓ ప్రత్యేక వీడియో కూడా విడుదల చేశారు. ఆ ఈవెంట్‌కు పాసులు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తారని, పాస్ లేకుండా వచ్చి ఇంబ్బందులకు గురి కావొద్దని రాజమౌళి స్పష్టం చేశారు. ఈ ఇన్విటేషన్ చూసి రాజమౌళి ఆలోచనలు.. ప్లానింగ్ నెక్ట్స్ లెవల్ అంటూ, నీ ఇన్నోవేటివ్ థాట్స్ వర్త్ జక్కన్న వర్త్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

## ఈ నెలాఖరులో స్పిరిట్ రెగ్యులర్ షూటింగ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ 'స్పిరిట్' భారీ బ్జడెట్‌తో తెరకెక్కనుంది. ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మూవీ నుంచి ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా అప్‌డేట్ అంటూ అనౌన్స్‌మెంట్‌ను వీడియోను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ షూటింగ్‌కి సంబంధించి దర్శకుడు సందీప్ రెడ్డి వంగ స్పందించాడు. ఈ సినిమా షూటింగ్‌ను నవంబర్ ఎండిరగ్‌లో ప్రారంభించ బోతున్నట్లు సందీప్ రెడ్డి వెల్లడిరచాడు. నవంబర్ తర్వాత రెగ్యులర్ షూటింగ్ ఉండబోతుందని 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నమని సందీప్ తెలిపాడు. అయితే ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి ప్రభాస్ తండ్రి పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలను సందీప్ ఖండిరచాడు. ఇక ఈ చిత్రంలో యానిమల్ భామ తృప్తి డిమ్రి కథానాయికగా నటించబోతుంది.



# ధాన్యం సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

- టోల్ ఫ్రీ నెంబరు 1800 425 3424
- ఫోన్ నంబర్ 9154252936
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, వరంగల్/పర్వతగిరి :** వరి ధాన్యం కొనుగోలులో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం మిల్లుకు చేరేవరకు పర్యవేక్షణపై ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కంట్రోల్ రూమ్ లో ఫిర్యాదుల స్వీకరణకు అధికారులకు విధులు కేటాయించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు, లారీలు, గోనె సంచులు, కొనుగోళ్ల ప్రక్రియ మానిటరింగ్, తదితర సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబరు 1800 425 3424 ఫోన్ నంబర్ 9154252936 ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..**

వర్ధన్నపేట మండల కేంద్రంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదా శుక్రవారం ప్రారంభించారు. రాయపర్తి మండల కేంద్రంలో ఐకేపీ, పీఏసీఎస్, పెరికేడు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, అదేవిధంగా పర్వతగిరి మండలంలోని అన్నారం గ్రామంలో, రావూరు గ్రామాల్లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సూచించారు. శుక్రవారం మండలంలోని రావూరు అన్నారం గ్రామాల్లో డీఆర్డీఏ డీఆర్డీఓ రామ్ రెడ్డి, డీఎస్ఓ కిష్టయ్య, మార్కెటింగ్ డీఎం సంధ్యారాణిలతో కలిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులను వద్ద నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్ లో నమోదు చేసి వెంటనే లారీల ద్వారా మిల్లులకి తరలించాలన్నారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని అడిగి తెలుసుకున్నారు. తేమా శాతం చెక్ చేయాలని, ప్రతిరోజు సంబంధిత అధికారులు, మండల అధికారులు కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబ్ ఎంట్రీలు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను అందిస్తూ ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చొప్పున మద్దతు ధర చెల్లించడంతోపాటు సన్న రకానికి అదనంగా రూ.500 అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా పరిషత్ సీఈవో, ఇంచార్జి డీఆర్ఓ రామిరెడ్డి, డీఎస్ఓ కృష్ణయ్య, డీఎం సంధ్యారాణి, తాసిల్దార్ వెంకటస్వామి, ఏవో ప్రశాంత్, ఏపీఎం రాజీర్, సీసీలు సుధాకర్, కొమురయ్య, ఆయా గ్రామాల సెంటర్ ఇంచార్జి రాణి, సంధ్య వీవో ప్రతినిధులు కొనుగోలు కమిటీ నిర్వాహకులు వివిధ శాఖల అధికారులు సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ఇది ప్రజా విజయం

- ప్రధాని మోదీ పాలనకు బీహార్ ప్రజల పట్టం
- కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పారు..
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా, రాహుల్ గాంధీ ఓటు చోరీ అంటూ మోసపూరిత ప్రకటనలు చేసినా బీహార్ ప్రజలు నిజాన్ని తెలుసుకుని బీజేపీకే పట్టం కట్టారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. బీహార్ లో బీజేపీ విజయం అనంతరం రవికుమార్ మాట్లాడుతూ ఇది ప్రజా విజయమని, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రగతి పాలనకు నిదర్శనమన్నారు. అంచనాలకు మించి భారీ మెజారిటీతో బీజేపీ విజయబావుట ఎగురవేసిందన్నారు. దేశాభివృద్ధిపైనే కాకుండా ప్రపంచ పటంలో భారత్ వికాసాన్ని మోదీ చాటుతున్నారన్నారు. ప్రజలు మరోసారి వికసిత్ భారత్‌కు సై అన్నారని పేర్కొన్నారు. ఓటు చోర్ అంటూ బీహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎంత విషపూరిత ప్రచారం చేసినా అక్కడి ఓటర్లు ఆయనను కనీసం లెక్కలోకి తీసుకోలేదన్నారు. చాలా ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులకు డిపాజిట్ కూడా దక్కలేదంటే కాంగ్రెస్ ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చన్నారు. పేదరాష్ట్రమైన బీహార్ రోడ్లు, కరెంట్, రైతులకు ఆర్థికసాయం, మహిళలకు ప్రత్యేక పథకాలను అందించి అభివృద్ధి దిశగా మోదీ నడిపించారని, అందుకే ఈ విజయం దక్కిందని గంట పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎన్నిక ఏదైనా దేశమంతా బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు..బీహార్ విజయం ప్రధాని మోదీ మార్క్ విజయమని గంట రవికుమార్ పేర్కొన్నారు. ఆయన పనితీరుకు ఇదే ప్రత్యేక నిదర్శనమన్నారు. దేశ ప్రజలు మోదీతోనే ఉన్నారనే సంకేతాన్ని అందించారన్నారు.



# బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి

☐ రామ రాజేష్ ఖన్నా డిమాండ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. ఎన్ హెచ్ఎం పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 2 నెలల వేతనాలు (సెప్టెంబర్, అక్టోబర్) తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద ప్రజలకు సేవ అందించడంలో ఎన్హెచ్ఎం ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని, కానీ వీరిని శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ యాకూబ్ పాషా, విక్టోరియా డిస్ట్రిక్ట్ అకౌంట్స్ ఆఫీసర్ సునీత, వరంగల్ జిల్లా అర్బన్ హెల్త్ సెంటర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జన్ను కార్నేల్, ఎన్హెచ్ఎం యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్, నర్సింగ్ ఆఫీసర్లు స్వప్న, భాగ్యలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్లు రజియా, లావణ్య, ప్రవీణ్, ఏఎన్ఎంలు శారద, విజయలక్ష్మి, ఫెనీన, జయమని, భాగ్యలక్ష్మి, ఉప్పలమ్మ, ఫార్మసిస్టులు జ్యోష్న, సతీష్, అకౌంటెంట్‌లు ప్రేమలత శ్రీనివాస్, స్వర్ణలత, ఎం.ఎన్.ఓ విజయ నాయక్, సపోర్టింగ్ స్టాఫ్ జాన్సన్, గౌస్ పాషా, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చెత్త తగ్గించేలా చర్యలు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- సానిటరీ ఇన్ స్పెక్టర్లు, జవాన్ లతో సమావేశం






**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాంపూర్ డంప్ యార్డ్ కు చేరే చెత్త పరిమాణం తగ్గించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో సానిటరీ ఇన్ స్పెక్టర్లు, జవాన్ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆటోలకు రూట్ ఆప్టిమైజేషన్ చేసినందున జవాన్ లు, సానిటరీ ఇన్ స్పెక్టర్లు వారికి కేటాయించిన వార్డులలో గల గృహాల నుంచి చెత్తను సేకరించి ఆటోలకు అందజేసేలా చూడాలన్నారు. 95శాతం కంటే ఎక్కువగా చెత్త సేకరణకు సంబంధించి రోజు వారి ఎక్విటెన్స్ రిపోర్ట్ ఉండాలని, ప్రతి ఒక పారిశుధ్య సిబ్బందికి 300-350 గృహాలను కేటాయించి వాటి నుంచి చెత్త సేకరించే విధంగా చూడడంతో పాటు వారికి కేటాయించిన ఏరియాలో పెరిగిన పొదలను తొలగించాలని ప్రస్తుతం బయో కంపోస్ట్ యూనిట్లు వచ్చాయని బయో మిథనైజేషన్ ప్లాంట్ రాబోతుందని విండ్రో కాంపోస్ట్ యూనిట్లు ప్రారంభిస్తున్నామన్నారు. అందువల్ల సోర్స్ సెగ్రిగేషన్ (తడి పొడి చెత్తను వేరు చేయడం) మొదలు పెట్టాలని, ప్రతి స్వచ్ఛ ఆటోకు వేరుగా తడి పొడి చెత్త ఛాంబర్ లు ఉండేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియను మొదటి ప్రయత్నంగా ప్రారంభించామని ఇందుకోసం తడి చెత్త సేకరణకు వీలుగా 20 లీటర్ల సామర్థ్యం గల బిన్ ను ఆటోలో ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో వర్నరబుల్ గార్బేజ్ పాయింట్ లు లేకుండా ఉండాలంటే ఇందుకు సంబంధించిన కమర్షియల్, రెసిడెన్షియల్, హోటల్స్ బార్లు రెస్టారెంట్లు లకు సంబంధించిన కమర్షియల్ చెత్త సేకరణ చేయడంతో పాటు వాటికి ఛార్జీ లు నిర్ణయించాలని ట్రేడ్ లైసెన్సుల కలెక్షన్ రెగ్యులర్ గా జరిగేలా విధంగా చూడాలని రాంపూర్ డంప్ యార్డుకు కు చేరే చెత్త పరిమాణం తగ్గించబడాలని చెత్త కంపోస్ట్ గా మారాలని, పొడి చెత్త రీసైకిల్ కావాలని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తి స్థాయిలో నిషేధించబడాలని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ లు నరేందర్, గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com